విద్యాభివృద్ధితోనే సమాజ పురోగతి

మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): విద్యాభివృద్ధితోనే సమాజ పురోగతి సాధించవచ్చని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ కాచిగూడలో ఆదివారం నిర్వహించిన ఎస్టీయూ (టీఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పీఆర్సీ కమిటీ తన నివేదికను పూర్తిచేసి ప్రభుత్వానికి వెంటనే అందించాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం పర్వత్‌రెడ్డి, జీ సదానందంగౌడ్ కోరారు. 5,571 ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని, బీఎడ్, డీఎడ్‌తో నిమిత్తం లేకుండా ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని వారు కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నేతలు ఆట సదయ్య, గజేందర్, ఏవీ సుధాకర్, ఎల్ఎం ప్రసాద్, పోల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించాలి: టీపీటీఎఫ్

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): ప్రాథమిక పాఠశాలలకు 10 వేల ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి, పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎస్జీటీలకు టీచర్ ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని ఫెడరేషన్ కోరింది. టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం వర్చువల్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వై అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, ఐదు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ నాగిరెడ్డి, ముత్యాల రవీందర్, తిరుపతి, శ్రీనివాస్, ప్రకాశ్‌రావు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ గుర్తింపునకు కొత్త రూల్స్

ఐదు గ్రేడ్లుగా కాలేజీలకు గుర్తింపు • ఆన్‌లైన్‌లోనూ కాలేజీల తనిఖీలు

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): కాలేజీలను గుర్తించే విధానాన్ని సమూలంగా మార్చేందుకు న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్) చర్యలు చేపట్టింది. అందుకోసం కొత్త నిబంధనలను రూపొందిస్తున్నది. తదనుగుణంగా ఇకపై ఏ, బీ, సీ, డీ గ్రేడ్లకు బదులుగా 5 స్థాయిల్లో మెచ్యూరిటీ బేస్డ్ గ్రేడెడ్ అక్రెడిటేషన్లు (ఎంబీజీఏ) జారీచేయనున్నది. దీనిపై న్యాక్ ఇటీవల బెంగళూరులో విస్తృతస్థాయి సమావేశాలను నిర్వహించింది. దక్షిణాది రాష్ట్రాల ఉన్నత విద్యా మండళ్ల చైర్మన్లతో పాటు పలువురు విద్యారంగ నిపుణులను ఈ సమావేశాలకు ఆహ్వానించి, న్యాక్ నిబంధనలను మరింత సరళతరం చేసేందుకు చేపడుతున్న చర్యలను వివరించింది. కొత్త నిబంధనలపై రాష్ట్రాల స్థాయిలో అవగాహన కల్పించాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి వీటిని అమలు చేసేందుకు సిద్ధమవ్వాలని సూచించింది. ఇప్పటివరకూ న్యాక్ గుర్తింపు కోసం కొన్ని కాలేజీలు మాత్రమే పోటీపడేవి. కానీ, ఇకపై అన్ని కాలేజీలు న్యాక్ గుర్తింపు పొందేలా ప్రోత్సహించేందుకు మార్గదర్శకాలను సవరించారు. న్యాక్ గుర్తింపును ఇచ్చేందుకు అనుసరిస్తున్న ప్రామాణికాలను 7 నుంచి 10కి పెంచారు. దీంతో ఇకపై కాలేజీలకు సంబంధించిన ఐదేండ్ల డాటాను న్యాక్ బృందం పరిశీలిస్తుంది. మౌలిక సదుపాయల పెంపు, ఫ్యాకల్టీ, ఫలితాలు, ఉపాధి అవకాశాలు, సొంత బిల్డింగ్ ఉన్నదా? లేదా? అనే అంశాలను పరిశీలించి కాలజీలకు మార్కులు ఇస్తుంది. గతంలో ఉన్న నిబంధనలతో కొన్ని కాలేజీలు మాత్రమే న్యాక్ గుర్తింపును పొందగలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిబంధనలను సరళీకరించాలని న్యాక్ నిర్ణయించింది.

కొన్ని మార్పులు

- కాలేజీలను న్యాక్ గుర్తింపు ఉన్నవి (న్యాక్ కాలేజీలు), న్యాక్ గుర్తింపు లేనివి (నాన్-న్యాక్ కాలేజీలు)గా విభజిస్తారు. న్యాక్ గుర్తింపు పొందిన కాలేజీలకు 5 అంచెల్లో గ్రేడ్స్‌ను జారీచేస్తారు.
- 1 నుంచి 4 గ్రేడ్లు పొందిన విద్యాసంస్థలను జాతీయ విశిష్ట విద్యాకేంద్రాలుగా, ఐదో గ్రేడ్ పొందిన కాలేజీలను గ్లోబల్ ఎక్సలెన్స్ కాలేజీలుగా పరిగణిస్తారు.
- కాలేజీల్లో ఉన్న ప్రమాణాల ఆధారంగా న్యాక్ గుర్తింపు ఇచ్చేవారు. ఇకపై విద్యా సంస్థలను 3 క్యాటగిరీలుగా విభజించి, విశ్వవిద్యాలయాలు, అటానమస్ కాలేజీలు, అనుబంధ కాలేజీలుగా గుర్తిస్తారు.
- న్యాక్ అంటేనే కొన్ని కాలేజీలు భయపడుతున్నాయి. ముఖ్యంగా వసతులు అంతగా లేని కాలేజీలు న్యాక్ గుర్తింపు కోసం ప్రయత్నించడం లేదు. ఇకపై ఈ కాలేజీలను పట్టణ, గ్రామీణ ప్రాంత కాలేజీలుగా విభజించి, నిబంధనలకు అనుగుణంగా సడలింపు ఇస్తారు.
- ఇప్పటి వరకూ న్యాక్ బృందాలు కాలేజీలను స్వయంగా పరిశీలించిన తర్వాతే గుర్తింపు ఇచ్చేవి. అలా కాకుండా ఇకపై ఆన్‌లైన్‌లోనూ పరిశీలించి అనుమతులు ఇవ్వాలని న్యాక్ భావిస్తున్నది.

న్యాక్ గుర్తింపు పొందేలా కాలేజీలను ప్రోత్సహిస్తాం

కాలేజీల గుర్తింపు ప్రక్రియను మరింత సరళీకృతం చేసేందుకు నిబంధనల్లో సమూల మార్పులు చేయాలని న్యాక్ ప్రతిపాదించింది. అన్ని కాలేజీలను న్యాక్ గుర్తింపు పరిధిలోకి తేవడం, నాణ్యతను పెంపొందించడమే దీని ఉద్దేశం. ఈ ప్రతిపాదనపై ఇటీవల నిర్వహించిన సమావేశాల్లో విస్తృత చర్చ జరిగింది. న్యాక్ గుర్తింపు పొందేలా రాష్ట్రంలోని అన్ని కాలేజీలను ప్రోత్సహిస్తాం. ఎస్ఎస్ఆర్ రిపోర్టు తయారీ కోసం డిగ్రీ కాలేజీలకు రూ.లక్ష చొప్పున గ్రాంట్ మంజూరు చేస్తున్నాం. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత కాలేజీలు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్

సర్కారుకు న్యాస్ భయం!

- నవంబర్ 19న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే
- ఈ ఏడాది 3,6,9 తరగతుల విద్యార్థులపై సర్వే

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): విద్యార్థుల్లోని అభ్యసనా సామర్థ్యాలు, ప్రతిభను పరీక్షించేందుకు కేంద్రం నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) పరీక్ష భయం రాష్ట్రప్రభుత్వాన్ని పీడిస్తుంది. మూడేండ్లకొకసారి ఈ సర్వేను కేంద్ర విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కేజీబీవీలు, మాడల్ స్కూళ్లు అన్నింటిలోనూ 3, 6, 9 తరగతులకు న్యాస్ సర్వేను నిర్వహించనున్నారు. కాగా, గతంలో 2021లో విడుదల చేసిన న్యాస్ ఫలితాలు ఏమాత్రం ఆశాజనకంగా లేవు. చదువులపై కరోనా ప్రభావం పడటంతో అప్పట్లో ఫలితాల్లో తెలంగాణ వెనుకబడింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు న్యాస్ ఫలితాలు, ఫెర్ఫార్మెన్స్ గ్రేడెడ్ ఇండెక్స్(పీజీఐ)లను సాకుగా చూపిస్తూ విద్యలో తెలంగాణ 31వ స్థానంలో ఉందంటూ ఆరోపణలు గుప్పించింది. ఈ ఏడాది సర్వేలో వెనుకబడితే అప్రతిష్ట మూటగట్టుకోవాల్సి వస్తుందన్న టెన్షన్ కాంగ్రెస్ సర్కారులో కనిపిస్తున్నది. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డియే విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. దీంతో ఫలితాల్లో వెనుకబడితే ఇబ్బందులు తప్పవన్న భావన సర్కారులో నెలకొన్నది. ప్రత్యేకంగా తయారుచేసిన న్యాస్ మాడల్ పేపర్లను విద్యార్థులకు అందించి ప్రాక్టీస్ చేయించే యోచనలో అధికారులు ఉన్నారు. దీని ద్వారా మెరుగైన గ్రేడ్ సాధించవచ్చని భావిస్తున్నారు. ఆగస్టు నెల రెండోవారం గడుస్తున్నా ఇంకా పాఠశాల విద్యాశాఖ బదిలీలు, పదోన్నతుల నుంచి బయటికిరాలేదు. నవంబర్ 19న న్యాస్ పరీక్ష ఉండటంతో దీని ప్రభావం సైతం పడుతుందని సర్కారు టెన్షన్‌పడుతున్నది.

ఇంటర్ సెకండియర్‌లో ఇంగ్లిష్ ప్రాక్టికల్స్

- ఈ ఏడాది నుంచి అమలు

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): ఇంటర్ దశలోనే విద్యార్థులు ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలు అర్జించేలా తర్ఫీదునిచ్చేందుకు, ఇంగ్లిష్‌పై విద్యార్థుల్లోని భయాన్ని తొలగించేందుకు ఇంటర్‌బోర్డు ప్రత్యేక చర్యలు చేపట్టింది. సెకండియర్ ఇంగ్లిష్‌లోనూ ప్రాక్టికల్స్‌ను అమలుచేస్తుంది. నిరుడు ఫస్టియర్‌లో ప్రాక్టికల్స్‌ను విజయవంతంగా అమలు చేయగా, ఈ ఏడాది సెకండియర్ విద్యార్థులకు విస్తరించారు. ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టం(ఐఈఎల్‌టీఎస్) ఎగ్జామ్ తరహాలో ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. తాజా విధానంతో ఆర్ట్స్, సైన్స్, ఒకేషనల్ కోర్సులన్న తేడాలేకుండా అందరికీ ప్రాక్టికల్స్ తప్పనిసరి అయ్యాయి. ఇంగ్లిష్ సబ్జెక్టుకు 80 మార్కులు థియరీ, 20మార్కులు ప్రాక్టికల్స్‌కు కేటాయిస్తారు. థియరీ ప్రశ్నపత్రాన్ని 80 మార్కులకు కుదించడంతో ప్రశ్నపత్రం స్వరూపం మారింది. మాదిరి ప్రశ్నపత్రాన్ని ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

సంక్షేమ హాస్టళ్ల మెస్‌చార్జీలు పెంచాలి

బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ

హైదరాబాద్, ఆగస్టు11 (నమస్తే తెలంగాణ): సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలను పెంచాలని, బిల్లులను గ్రీన్ చానల్ పద్ధతిలో చెల్లించాలని బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులతో కలిసి ఆదివారం హైదరాబాద్ బర్కత్‌పురా నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆరేండ్ల క్రితం ధరల ప్రకారమే మెస్ చార్జీలను చెల్లిస్తున్నారని, ధరలు పెరగడంతో కాంట్రాక్టర్లు నాసిరకం ఆహారం పెడుతున్నారని ధ్వజమెత్తారు. మెనూ పాటించడం లేదని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ర్యాలీలో నాయకులు అర్జున్, ప్రవీణ్, రుద్ర, అభి, చరణ్ పాల్గొన్నారు.

కేయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్

కేయూ ఎగ్జామినేషన్ అధికారుల తప్పిదం

- సర్టిఫికెట్స్‌లో బీకాం కంప్యూటర్స్‌కు బదులు బీకాం
- అయోమయంలో విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 11 : కాకతీయ విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్ అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. మూడేండ్లు కష్టపడి చదివి సంతోషంగా సర్టిఫికెట్స్ తీసుకునే సమయంలో చదివింది ఒక్కటైతే సర్టిఫికెట్‌లో మరొకటి రావడంతో అవాక్కయ్యారు. అధికారుల తప్పిదం వల్ల విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. గతంలో 100కు 105 మార్కులు కూడా వేసిన ఘనత కాకతీయ విశ్వవిద్యాలయానికే దక్కింది. విద్యార్థులు పరీక్షకు హాజరై రాసినా కూడా గైర్హాజరైనట్లు ఫెయిల్ చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఒక పేపర్‌కు బదులు మరో పేపర్ ప్రశ్నపత్రం ఇచ్చారు. ఇటీవల ఆన్సర్ బుక్‌లెట్లు మార్చిన ఘటన కేయూలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. పరీక్షల విభాగంలో జరిగిన తాజా పరిణామాలు చూస్తే విద్యార్థులు ఒక్కసారిగా అవాక్కయ్యారు.

బీకాం కంప్యూటర్స్‌కు బదులు బీకాం..

వర్సిటీ పరీక్ష విభాగం తప్పిదం వల్ల బీకాం కంప్యూటర్స్ పూర్తిచేసిన విద్యార్థులకు బీకాం సర్టిఫికెట్ రావడంతో అయోమయానికి గురయ్యారు. 80 మంది విద్యార్థులకు బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ అని ఉండాల్సిన సర్టిఫికెట్లలో బీకాం పూర్తి చేసినట్టు ఇచ్చారు. ఇదేంటని ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతిని నిలదీశారు.

మళ్లీ కొత్త మెమోలు జారీ చేస్తాం

సర్టిఫికెట్స్ ముద్రించే క్రమంలో ఎక్కడో తప్పిదం జరిగింది. బీకాం కంప్యూటర్స్‌కు బదులు సర్టిఫికెట్‌లో బీకాం అని వచ్చినట్టు తెలిసింది. ఈ విషయమై సిబ్బందిని మందలించాం. మళ్లీ కొత్త సర్టిఫికెట్స్ ప్రింట్ తీసి కాలేజీకి పంపిస్తున్నాం.

– ప్రొఫెసర్ నర్సింహాచారి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి

త్వరలోనే ఓవర్సీస్ స్కీం నిధులు

- తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు
- బీసీ సంక్షేమశాఖ వెల్లడి
- 'నమస్తే తెలంగాణ' కథనంపై స్పందన

హైదరాబాద్, ఆగస్టు11 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని ఎక్కువ మందికి వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని, దీంతో నిధుల విడుదలలో జాప్యమవుతున్నదని బీసీ సంక్షేమశాఖ స్పష్టంచేసింది. అర్హుల జాబితా ప్రకటన, నిధుల విడుదలలో జాప్యం అంశంపై ఇటీవల 'విదేశీ విద్యానిధి ఎప్పుడు?' పేరిట 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. స్పందించిన బీసీ సంక్షేమశాఖ ఆదివారం పకటన విడుదల చేసింది. ఓవర్సీస్ స్కీంకు సంబంధించి ఈ ఏడాది ఎంపిక ప్రక్రియను మార్చి 2024లోనే పూర్తి చేయాల్సి ఉన్నదని, ఎన్నికల కోడ్ కారణంగా జాప్యం జరిగిందని తెలిపింది. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఏటా 300 మందికి స్కాలర్‌షిప్‌లు ఇచ్చేదని, ప్రస్తుతం ఆ సంఖ్యను రెండింతలు లేదంటే మూడింతలు చేయాలని సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రివర్గం ఆలోచిస్తున్నదని వెల్లడించింది. అర్హుల ఎంపికను ఒకేసారి రిలీజ్ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని వివరించింది. ఇప్పటికే స్కాలర్‌షిప్ మొదటి దశ పేమెంట్ పొందినవారికి రెండో దశ పేమెంట్ పూర్తి చేసేందుకు ఆర్థికశాఖను సంప్రదించామని, త్వరలోనే నిధులు విడుదల చేస్తారని తెలిపింది. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బీసీ సంక్షేమశాఖ హామీ ఇచ్చింది.

రాజడి

నెలకు రూ.6,400తో కోటిన్నర రిటైర్మెంట్ ఫండ్

ప్రస్తుతం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్వో) వార్షిక వడ్డీరేటు ఆకర్షణీయంగా ఉన్నది. 8.25 శాతంగా అమలవుతున్నది. దీంతో నెలకు రూ.6,400 చొప్పున 35 ఏండ్లు చెల్లిస్తే.. మెచ్యూరిటీ సమయంలో దాదాపు రూ.1.52 కోట్లు అందుకోవచ్చు. అలాగే రూ.10,600తో రూ.2.51 కోట్లు పొందవచ్చు. అయితే రూ.12,500 చొప్పున 37 ఏండ్లు చెల్లిస్తే రిటైర్మెంట్ వయసులో రూ.3.5 కోట్లు తీసుకోవచ్చు. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) అనేది ఉద్యోగుల కోసం ఉన్న సురక్షిత ప్రభుత్వ పొదుపు పథకం. నెలనెలా వేతన జీవులు కొంత మొత్తాలను చెల్లిస్తే.. పదవీ విరమణ తర్వాత ఒకేసారి పెద్ద మొత్తంలో లభిస్తుంది. కాగా, ఈపీఎఫ్‌పై వడ్డీరేటును కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్ణయిస్తూ ఉంటుంది. సాధారణంగా 58 ఏండ్లు దాటితే గానీ లబ్ధిదారునికి ఈపీఎఫ్‌వో పెన్షన్ రాదు. ముందస్తు పెన్షన్ కావాలంటే కనీసం 50 ఏండ్లైనా దాటాలి. 58 ఏండ్లు దాటిన తర్వాత రెండేండ్లు వాయిదా వేసుకోవచ్చు. దానికి ఏటా 4 శాతం అదనపు వడ్డీరేటు లభిస్తుంది.

గణాంకాలే కీలకం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం భారీగా నష్టపోయాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,276.04 పాయింట్లు లేదా 1.57 శాతం కోల్పోయి 79,705.91 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 350.20 పాయింట్లు లేదా 1.41 శాతం దిగజారి 24,367.50 దగ్గర నిలిచింది. దేశ-విదేశాల్లో ప్రతికూల పరిణామాలు, ఆల్‌టైమ్ హై దరిదాపుల్లో సూచీలు కదలాడుతుండటం.. మదుపరులను లాభాల స్వీకరణ వైపునకు నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ఒడిదొడుకులకు వీలున్నదనే చెప్పవచ్చు. ద్రవ్యోల్బణం, వాణిజ్య గణాంకాలు కీలకం కానున్నాయి. ఇక వరుసగా 9వసారీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచినందున ఆ ప్రభావంతో బ్యాంకింగ్, ఆటో, రియల్టీ షేర్లు నష్టాలకు లోనయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక అమెరికా, ఐరోపా దేశాల్లో ఆర్థిక మందగమనం నడుమ ఐటీ రంగ షేర్లకూ ఎదురుదెబ్బే. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,900-25,200 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

ఎల్‌టీసీజీ ట్యాక్స్‌లో ఏది లాభం?

స్థిరాస్తి విక్రయాలపై పాత, కొత్త పన్ను విధానాలు ఏమిటి?

ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను గత నెల 23న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రకటించిన దగ్గర్నుంచి లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ లేదా దీర్ఘకాల మూలధన లాభాలు) పన్ను మాట అందరి నోటా వినిపిస్తున్నది. 2001 ఏప్రిల్ 1 నుంచి కొన్న ఇండ్లను ఇకపై అమ్మితే.. ఇండెక్సేషన్ బెనిఫిట్ లేకుండా 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాలంటూ బడ్జెట్‌లో మంత్రి చేసిన ప్రకటనే ఇందుకు కారణం.

ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటే?

ఇండెక్సేషన్ బెనిఫిట్ (ద్రవ్యోల్బణం ప్రయోజనం)ను కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ (సీఐఐ) నెంబర్ల ఆధారంగా లెక్కిస్తారు. 2001-02 ఆర్థిక సంవత్సరం నుంచి (2001 ఏప్రిల్ 1 మొదలు) ప్రతీ ఆర్థిక సంవత్సరం కొత్త సీఐఐ సిరీస్ నెంబర్లను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ విడుదల చేస్తూ వస్తున్నది. 2001-02లో నాటి ద్రవ్యోల్బణం ఆధారంగా ఇది 100గా ఉన్నది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఇప్పటి ద్రవ్యోల్బణం రేటు ప్రకారం సీఐఐని 363గా నిర్ణయించారు. దీని ప్రకారం 2001-02లో ఇల్లు కొనడానికి మీరు పెట్టిన ప్రతీ లక్ష రూపాయల విలువ.. ప్రస్తుతం రూ.3.63 లక్షలతో సమానం. ఒక వేళ నాడు రూ.5 లక్షలకు కొంటే.. ఇప్పుడు దాని విలువ రూ.18.15 లక్షలు. ఇంతకన్నా ఎక్కువ ధరకు మీ ఇల్లును అమ్ముకుంటే, ఆ మొత్తంపై మాత్రమే ఎల్‌టీసీజీ ట్యాక్స్ వర్తిస్తుంది. దీన్నే ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటారు. దీన్ని తీసేస్తా



మని, దానికి బదులుగా పన్నును 20 శాతం నుంచి 12.5 శాతానికి (7.5 శాతం) తగ్గిస్తామని బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అయినప్పటికీ రియల్ ఎస్టేట్ వర్గాలు, ఇండస్ట్రీ నిపుణుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకతే వ్యక్తమైంది. దీనికి తలొగ్గిన మోదీ సర్కారు.. బడ్జెట్‌లో తాము తెచ్చిన కొత్త పన్ను విధానం, ఇప్పటికే ఉన్న పాత పన్ను విధానం రెండూ అమల్లో ఉంటాయని, ఏది లాభమైతే దాన్ని ట్యాక్స్ పేయర్స్ ఎంచుకోవచ్చని గత వారం పార్లమెంట్‌లో సభ్యులకు పంచిన ఆర్థిక బిల్లు-2024 సవరణ డాక్యుమెంట్లలో చెప్పింది. అసలు ఈ రెండు విధానాలు ఎలా ఉన్నాయి? ఇందులో ఏది లాభం? అనేది పక్కనున్న బాక్స్‌లో పరిశీలించవచ్చు.

చివరగా..

బడ్జెట్‌కు ముందు (ఈ ఏడాది జూలై 23) ఇల్లు కొని, వాటిని ఇప్పుడు అమ్ముతున్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాల (హెచ్ యూఎఫ్)వారికే ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను ఎంచుకునే వీలుంటుందని ఆర్థిక బిల్లు సవరణలో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీని ప్రకారం గత నెల 23 లేదా ఆ తర్వాత ఇండ్లు కొన్నవారు భవిష్యత్తులో వాటిని అమ్ముకుంటే ఇండెక్సేషన్ బెనిఫిట్ వర్తించదన్నమాట. అంటే అధిక ఎల్‌టీసీజీ ట్యాక్స్ భారాన్ని మోయక తప్పదు.

పాత పన్ను ప్రకారం

2014-15లో రూ.40 లక్షలతో మహేశ్ ఓ ఇంటిని కొనుగోలు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ 240గా ఉన్నది. ఈ ఏడాది జూన్‌లో దాన్ని రూ.75 లక్షలకు అమ్మేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ 363గా ఉన్నది. దీంతో ఇంటిని అమ్మిన ఆర్థిక సంవత్సరం సీఐఐతో.. ఇంటిని కొన్న ఆర్థిక సంవత్సరం సీఐఐని భాగించడం జరుగుతుంది. 363/240= 1.5125 వస్తుంది. దీన్ని ఇంటిని కొన్న ధర రూ.40 లక్షలతో గుణిస్తే.. రూ.60,50,000గా ఉంటుంది. ఇది ప్పుడు మహేశ్ ఇంటి విలువ అన్నమాట. ఇక ఇంటిని అమ్మడం ద్వారా వచ్చిన రూ.75,00,000 నుంచి ఈ రూ.60,50,000ను తీసేయాలి. అప్పుడు రూ.14,50,000 మిగులుతుంది. దీని పైనే ఎల్‌టీసీజీ పన్ను 20 శాతం అంటే రూ.2.90 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది.

కొత్త పన్ను ప్రకారం

అమ్మిన ధర రూ.75 లక్షల నుంచి కొన్న ధర రూ.40 లక్షలను తీసేస్తే.. మిగిలే ఆ రూ.35 లక్షలపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాలి. అంటే రూ.4,37,500 కట్టాలి. పాత పన్ను ప్రకారం చెల్లింపుతో చూస్తే ఈ కొత్త పన్ను ప్రకారం మీపై రూ.1,47,500 అదనపు భారం పడుతున్నదన్నమాట. ఎల్‌టీసీజీ పన్ను చెల్లింపుల్లో ఇండెక్సేషన్ బెనిఫిట్ ఉండటం వల్ల పాత పన్ను విధానంలో ట్యాక్స్ పేయర్లకు కలిగే లాభం, దాన్ని తీసేయటం వల్ల కొత్త పన్ను విధానంలో వచ్చే నష్టం ఇదే. కాబట్టి మహేశ్ పాత పన్ను విధానాన్ని ఎంచుకుని ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను చెల్లిస్తే రూ.1,47,500 మిగులుతుంది. అలా కాదని, కొత్త పన్ను విధానాన్ని ఎంచుకుంటే ఆ మేరకు నష్టపోవాల్సి వస్తుంది.

2001 ఏప్రిల్ 1కి ముందు..

గత నెల ప్రకటించిన బడ్జెట్‌లో 2001 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత కొన్న ఇండ్ల అమ్మకాలపైనే ఎల్‌టీసీజీ ట్యాక్స్ లెక్కింపులో మార్పులు చేశారు. అయితే అంతకుముందు మాటేమిటి? అన్న ప్రశ్న ఇక్కడ తలెత్తకమానదు. 2001 మార్చి 31లోపు కొన్న ఇండ్ల విక్రయాలకు 1981-82 ఆర్థిక సంవత్సరం నుంచి 2016-17 ఆర్థిక సంవత్సరం మధ్య ఉన్న ఐటీ శాఖ పాత సీఐఐ నెంబర్ సిరీస్ ఆధారంగా ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను లెక్కిస్తారు. అయితే ఇప్పుడు అమ్ముకున్నా 2016-17 సీఐఐ నెంబరే వర్తిస్తుందని గుర్తుంచుకోవాలి. దీనికి ఇటీవలి బడ్జెట్ సవరణలతో పనిలేదు. కాబట్టి 2001 మార్చి 31లోపు ఇండ్లు కొన్నవారు పాత సీఐఐ నెంబర్ల ప్రకారమే తమ స్థిరాస్తి క్రయవిక్రయాలపై దీర్ఘకాల మూలధన లాభాల పన్నును చెల్లించవచ్చు.

ఇదీ లెక్క..

ఉదాహరణకు 1984 జూన్‌లో మీరు రూ.2 లక్షలు పెట్టి ఇల్లు కొన్నారు. అప్పుడు సీఐఐ నెంబర్ 125గా ఉన్నది. ఈ